

'బోగస్'పై ఫోకస్!



ఉమ్మడి జిల్లాలో నకిలీ రేషన్ కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డులపై ఫోకస్ పెట్టింది. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో అనర్హులను గుర్తించి ఏరివేయాలని నిర్ణయించింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డుదారుల జాబితాను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులను సర్కార్ ఆదేశించింది. ఆరు నెలలకుపైగా రేషన్ బియ్యం తీసుకోని వారి కార్డులను తీసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే స్థానికంగా ఉండని, పెళ్లిచేసుకొని వెళ్లిపోయిన వారిని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించింది. దీంతో జిల్లా అధికారులు రేషన్ డీలర్ల వారీగా జాబితాను పరిశీలిస్తున్నారు. అనర్హులను గుర్తించి ఏరివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



- ఏరివేతకు కసరత్తు మొదలు పెట్టిన సర్కార్
- ఆరు నెలలుగా రేషన్ తీసుకోకుంటే కార్డు కట్
- స్థానికంగా లేని, చనిపోయిన వారి గుర్తింపు
- క్షేత్రస్థాయిలో రేషన్ జాబితా పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో 17,301 బోగస్ రేషన్‌కార్డులు
- మరో 10వేల వరకు ఉండొచ్చని అంచనా
- సర్వే కొనసాగిస్తున్న విచారణ సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం అనర్హుల కార్డులను తొలగించేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. రేషన్ షాపుల ద్వారా సరఫరా చేసే సబ్సిడీ రేషన్ పంపిణీలో ఇంకా పెద్ద ఎత్తున అక్రమాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. సరుకు పంపిణీలో అవకతవకలు ఒక వైపు జరుగుతుండగా.. మరోవైపు బోగస్ రేషన్ కార్డులు పెద్ద సంఖ్యలో కొనసాగుతున్నాయి. స్థానికంగా లేని వారితో పాటు చనిపోయిన వారి పేరు మీద ఇంకా కార్డులు కొనసాగుతున్నాయి. అలాగే అర్హత లేని వారికి కూడా పెద్ద సంఖ్యలో కార్డులు ఉన్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో వేలాదిగా బోగస్ కార్డులు ఉన్నాయి. ఇటీవలే దొడ్డుబియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. వీటి పంపిణీకి ప్రభుత్వం గతంలో

మిగతా 7వ పేజీలో...

సన్న బియ్యం పంపిణీ తరువాత..

మరో వైపు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం బాగున్నాయనే ప్రచారంతో రేషన్ దుకాణాల్లో బియ్యం కోసం జనం బారులు తీరుతున్నారు. దీంతో ఏప్రిల్, మే నెలలో చౌక ధరల దుకాణాల్లో రేషన్ బియ్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. గతంలో డీలర్లు నెలంతా బియ్యం పంపిణీ చేస్తుండే వారు. కార్డుదారులు వీలున్నపుడే రేషన్ బియ్యం తీసుకునే వారు. నెలాఖరు వరకు పంపిణీ చేసిన 70శాతం సరుకు కూడా అమ్ముడయ్యేది కాదు. అయితే ఇపుడు సన్న బియ్యం ప్రతినెలా 15వ తేదీనాటికే 95శాతానికిపైగా అమ్ముడవుతున్నాయి. గతంలో ఏడాదికి రెండు మూడు సార్లు మాత్రమే రేషన్ బియ్యం తీసుకునే కుటుంబాలు ఇప్పుడు సన్న బియ్యం క్రమం తప్పకుండా తీసుకుంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో రేషన్ పంపిణీ ఇలా...

జిల్లా	రేషన్ షాపులు	ఆహార భద్రత కార్డులు	బోగస్ కార్డులు (గుర్తించినవి)
రంగారెడ్డి	936	5,78,500	6,711
మేడ్చల్	619	5,36,755	8.300
వికారాబాద్	588	2,50,563	2,290



నజ్దిక్‌సింగారం సీతారామాలయంలో చోరీ వివరాలు సేకరిస్తున్న ఏసీపీ

ఒకే రోజు మూడు చోరీలు

- సీతారామాలయాలో అమ్మవారి మంగళసూత్రం, హుండీ అపహరణ
- శివాలయంలో హుండీ ఎత్తుకెళ్లిన దొంగలు
- విచారణ చేపట్టిన ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, మే 29(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో గురువారం ఒకే రోజు మూడు ఆలయాల్లో చోరీలు జరగడం కలకలం రేపింది. నజ్దిక్‌సింగారం గ్రామంలోని సీతారామచంద్ర స్వామివారి ఆలయంలోకి దుండగులు చొరబడి ప్రధాన ద్వారానికున్న గ్రిల్స్‌తో పాటు తలుపుల తాళాలను ధ్వంసం చేశారు. ఆలయంలోని హుండీ, అమ్మవారి మెడలో ఉన్న మంగళసూత్రం ఎత్తుకెళ్లారు. ఘటనా ప్రదేశానికి ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డిలు చేరుకొని చోరీకి సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే, యాచారం మండల కేంద్రంలోని మరో సీతారామాలయంలోనూ చోరీ జరిగింది. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి అమ్మవారి మెడలో ఉన్న మంగళసూత్రం, ఇతర వస్తువులను అపహరించారు. అదేవిధంగా మొగ్గుళ్ల వంపు గ్రామంలో శివాలయంలో దుండగులు హుండీ ఎత్తుకెళ్లారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

రంగారెడ్డి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి యాసంగిలో వరి ధాన్యం సేకరణ, వానాకాలం సాగు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, భూ భారతి చట్టం అమలు తీరు, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. రాజీవ్ యువ వికాసంపై పలువురు శాసన సభ్యులు బ్యాంకు సిబిల్ స్కోర్‌లో ఎదురవుతున్న ఇబ్బందుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి రాజీవ్ యువ వికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని జూన్ మూడో తేదీ నుంచి అన్ని మండలాల్లో విజయవంతంగా అమలు చేసేలా

మిగతా 7వ పేజీలో...



చౌదర్‌పల్లిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్

యాచారం, మే 29(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి రైతువేదికలో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కూరగాయల సాగు, చీడపీడల నివారణ తదితర అంశాలపై మెలకువల గురించి వివరించారు. పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించుకోవాలన్నారు. పశువుల ఎరువులు వాడితే నేల సారవంతం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఆధునిక పరికరాల వినియోగంతో స్మార్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. డ్రోన్ల ద్వారా మందులు వేసుకోవాలన్నారు. డ్రిప్‌తో కూరగాయలకు నీటితో పాటు మందులువాడితే మంచి ఫలితాలుంటాయని చెప్పారు. సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున, డాక్టర్ కీర్తి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాతరెడ్డి, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులున్నారు.



ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పంటలకు మద్దతు ధర చరిత్రాత్మకం

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

మహేశ్వరం, మే 29(ఆంధ్రజ్యోతి) : మునుపెన్నడూ లేనివిధంగా 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం అమీర్‌పేట గ్రామంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల ధరలు అంతర్జాయంగా పెరిగినప్పటికీ పాత ధరలకే కేంద్రం అందిస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేక పోయిందన్నారు. కార్యక్రమంలో పాపయ్యగౌడ్, బొక్క నర్సింహ్మారెడ్డి, అంజయ్యయాదవ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, హరిబాబు, రవీందర్‌రెడ్డి, పి.సుదర్శన్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, అనంతయ్యగౌడ్ ఉన్నారు.

కమ్ముకున్న మబ్బులు.. కర్షకుల్లో గుబులు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే రావడంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వానలు పడుతున్నాయని రైతులు ఆనందపడాలో.. లేదంటే బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ ధాన్యం అమ్మకాలు పూర్తి కాలేదు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేయకపోవడంతో ధాన్యం బస్తాలు వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. గురువారం కొంగరకలాన్‌లో ఉన్న కలెక్టరేట్ భవనం మీదుగా కమ్ముకున్న కారు మబ్బులను చూసి చుట్టు పక్కల ఉండే రైతులు ఆందోళన చెందారు. చిరు జల్లులు మాత్రమే కురవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.



- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

నకిలీ విత్తనాలు అమ్మితే

పీడీ యాక్ట్

- చేవెళ్ల ఏడీఏ సురేష్ బాబు

చేవెళ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చేవెళ్ల ఏడీఏ సురేష్ బాబు, చేవెళ్ల ఎస్సై శిరీష హెచ్చరించారు. గురువారం చేవెళ్ల పట్టణంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబంధలను ఉల్లంఘించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులు విక్రయించాలని సూచించారు. డీలర్లు స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై పొందుపర్చాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదు తప్పక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏవో శంకర్‌లాల్, డీలర్లు, తదితరులు ఉన్నారు.


నిర్లక్ష్యమే ఊపిరి తీసింది.!

చేవెళ్ల మండలం కేసారం గ్రామానికి చెందిన కల్లెంల నర్సింహులు (45) బొడ్డుపై గడ్డ కావడంతో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ఆపరేషన్ చేసి తొలగిస్తామని డాక్టర్లు చెప్పారు. దీనికి వారం రోజులు సమయం పడుతుందని, వెంటనే కుదరదని చెప్పటంతో అతను చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రజావైద్యశాలకు వచ్చాడు. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పడంతో అక్కడ ప్రైవేట్ డాక్టర్ సరేనని ఒప్పుకున్నాడు. ఈనెల 28 బుధవారం రాత్రి ఆపరేషన్ చేసి బొడ్డుపై ఉన్న కణితిని తొలగించారు. మరుసటి రోజు గురువారం ఉదయం అతను తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. బీపీ ఎక్కువ, తక్కువ కావడంతో వెంటనే పక్కనే ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నర్సింహులు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుడి నిరక్ష్యం కారణంగానే నర్సింహులు మృతి చెందినట్లు కేసారం గ్రామస్తులు, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులతో ఆస్పత్రి యాజమాన్యం బేరసారాలకు దిగినట్టు తెలిసింది. రూ.7లక్షలు ఇస్తామని వారిని ఒప్పించినట్లు సమాచారం.



నర్సింహులు మృతదేహం

అనుమతిలేని వైద్యం!



రోగుల ప్రాణాలతో చెలగాటం

- మితిమీరుతున్న శంకర్‌దాదాల ఆగడాలు
- ప్రభుత్వ నిబంధనలు గాలికి..
- ఎటు చూసినా డయాగ్నొస్టిక్, ఎక్స్‌రే సెంటర్లే
- రిజిస్ట్రేషన్ లేకుండానే నిర్వహణ
- సీజ్ అయిన 24 గంటల్లోనే తిరిగి ఓపెన్

ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు

అల్లోపతి	1,453
డెంటల్	394
ఆయుర్వేదం	42
హోమియోపతి	08
ఫిజియోథెరపి	49
డయాగ్నొస్టిక్స్	569
ఇతర ఆస్పత్రులు	745

రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గల్లీకో ఆసుపత్రి ఏర్పాటవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నిర్లక్ష్యపు మాటున పేదలను నిలువునా దోచుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శంకర్ దాదాల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రైవేట్ క్లినిక్‌లు ఆడిందే ఆటగా పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. వైద్య పరీక్షల పేరిట చేసే టెస్టులకు ఫీజులకు నియంత్రణ లేకపోవడంతో శంకర్ దాదాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి అనుభవం, అర్హత లేకుండా క్లినిక్‌లు ఏర్పాటుచేసి, నిబంధనలకు విరుద్ధంగా రోగులను చేర్చుకుని, చికిత్సలు చేస్తున్నారు. వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలు తీస్తున్నారు. ఏదైనా ఘటన

మిగతా 8వ పేజీలో...

రాజకీయాలకతీతంగా
ఇందిరమ్మ ఇళ్లు
చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
7

టీపీసీసీ నూతన కమిటీలో
చల్లా, మల్లు రవి
హర్షం వ్యక్తం చేసిన నాయకులు
7

రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అవతరణ వేడుకలను జూన్ 2న ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవతరణ వేడుకల నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. స్టేజి అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. గౌరవ వందన కార్యక్రమానికి, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖకు,

మిగతా 8వ పేజీలో...

తడిసి మొలకెత్తుతున్న ధాన్యం

- పది రోజులుగా పత్తాలేని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- ముకుందాపూర్‌లో అన్నదాతల ఆగమాగం


కొనుగోలు కేంద్రం వద్ద మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

యాలాల, మే 29, (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంబంధిత అధికారి లేకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది. రోజూ కురుస్తున్న వర్షంతో వడ్లు మొలకెత్తుతున్నాయి. మొలకలను చూసి రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు సరైన టైంలో లారీలు రాక ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోతోంది. అటు కొనుగోలు కేంద్రం నిర్వహకుడు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియక యాలాల మండలం ముకుందాపూర్ రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కొందరు రైతుల ధాన్యాన్ని తలరించగా, సగానికిపైగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే నిలిచింది. కొనుగోలు కేంద్రం నిర్వహకుడు సకాలంలో స్పందించకపోవడంతో కురుస్తున్న వర్షం కారణంగా ధాన్యం తడిసి మొలకెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా గ్రామాల్లో రైతులు పండి ంచిన ధాన్యాన్ని కొనుగోలు చేయగా, తమ గ్రామంలో పది రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద అలాగే నిలిచిపోయాయని ముకుందాపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా నిల్వ ఉంచిన ధాన్యం నాని మొలకెత్తు తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట కళ్లముందే వర్షం కారణంగా మొకెత్తుతుంటే తట్టుకోలేకపోతున్నామని రైతులు లక్ష్మణ్‌నాయక్, భీమయ్య, ఎర్యానాయక్‌తోపాటు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో లేని ఐకేపీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


ముకుందాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద ఆరుబయట ఉన్న ధాన్యం


వర్షానికి వడ్ల కుప్ప వద్ద నిలిచిన నీరు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్ రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల సహకారంతో హౌస్ ఆయా(హోమ్ నర్సింగ్)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు గురువారం పేర్కొన్నారు. జూన్ 3 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ 13 రోజులపాటు ఉంటుందన్నారు. అభ్యర్థులు సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చేల్ జిల్లాలకు చెందిన వారై ఉండాలన్నారు. వివరాలకు 7893121143, 9391487797 సెల్ నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

అప్పుడు నాటారు.. ఇప్పుడు నరికారు!

● అనాలోచితంగా మొక్కలను నాటించిన అధికారులు.. ● వృథా అవుతున్న ప్రజాధనం


హరిదాసుపల్లి-చింతకుంట రోడ్డు పక్కన విద్యుత్ లైన్ కింద నరికిన చెట్లు

ధారూరు, మే 29(ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం.. అవి పెరిగిన తర్వాత నరకడం పరిపాటిగా మారింది. దీంతో మానవ శ్రమ, ప్రజాధనం రెండూ వృథా అవుతున్నాయి. అలాగే పనికొచ్చే చోట్ల నాటాల్సిన మొక్కలు వృథా అవుతు న్నాయి. జిల్లా, మండల స్థాయి అధికారుల అనాలోచిత నిర్ణయాలతో రోడ్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద హరితహారం మొక్కలు నాటారు. అవి పెరిగి విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. గాలివాన వచ్చినప్పుడు చెట్ల కొమ్మలతో షార్ట్ సర్క్యూటై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వైర్ల తగలకుండా కొమ్మలను సిబ్బంది నరికివేయిస్తున్నారు. హరిదాసుపల్లి-చింతకుంటకు రోడ్డు పక్కన విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్లను సగానికి నరికేశారు. ఇలా ప్రతీ గ్రామంలో విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్లను లైన్ తగిలే సమయంలో అలాగే రోడ్డు విస్తరణలో నరికివేయటం తరచూ జరుగుతూనే ఉంది. అసలు చెట్లను పెంచుతున్నది పర్యావరణ పరిరక్షణకా? లేక నరికేందుకా? అన్నట్లు పరిస్థితి ఉంది. మొక్కలను నాటి పెంచి పెద్ద చేసేందుకు పెట్టిన ఖర్చు చేసిన నిధులు వ్యర్థం అవుతున్నాయి. అధికారులు ఆలోచన చేయకుండా లక్ష్యం కోసం రోడ్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటించటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటొద్దని ఆర్అండ్‌బీ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు సూచించినా గతంలో పనిచేసిన జిల్లా, మండల స్థాయి అధికారులు వినకుండా మొక్కలు నాటడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. ఇకనైనా రోడ్ల పక్కన, విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటకుండా ఖాళీ ప్రదేశాల్లో, పొలాల గట్టున నాటేలా చూడాలని ప్రజలంటున్నారు.


నరికివేసిన చెట్లు

రంగాపూర్ వీవోఏపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రంగాపూర్‌లో వీవోఏపై విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పరిగి, మే 29 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ వీవోఏ యాదయ్య మహిళా సంఘాల సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేశారని వచ్చిన ఆరోపణలపై గురువారం డీపీఎం మహిళలతో విచారణ జరిపారు. 'డబ్బులిస్తేనే రుణాలిప్పిస్తా.. రంగాపూర్ వీవోఏ చేతివాటం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనానికి డీఆర్‌డీఏ అధికారులు స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీపీఎం నర్సింహులు రంగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. వీవోఏతో పడుతున్న ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. సంఘాల మహిళలతో వేర్వేరుగా ఆయన విచారణ చేశారు. విచారణ నివేదికను డీఆర్‌డీఏ పీడీకి అందజేస్తామని అధికారి తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ భవనం

చౌడాపూర్, మే 29(ఆంధ్రజ్యోతి): చౌడాపూర్‌లో పురాతన ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోకి మార్చారు. అయితే పాత ప్రాథమిక పాఠశాల భవనాన్ని సగభాగం కూల్చి సగ భాగంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు, అంగన్‌వాడీకి ఉపయోగిస్తున్నారు. సగ భాగం కూల్చిన ప్రాథమిక పాఠశాల భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రయితే మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడ పడేస్తున్నారు. దీంతో సమీపంలోనే ఉన్న ప్రభుత్వ కార్యాయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల భవనం ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు

రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

కీసర రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషిచేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారని క్రాంతి కీన్ ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఏపీలోని కోరుకొండ, కలికిరిల్లోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని గురువారం కాంత్రి కీన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం ఎంపీ రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ.. ప్రవేశ పరీక్షకు హాజరై ఫలితాలు వెల్లడించిన తరువాత పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవటం బాధాకరం అన్నారు. ఉమ్మడి ఏపీలో ఏర్పాటైన సైనిక్ స్కూళ్లల్లో తెలంగాణ విద్యార్థులనూ స్థానికులుగానే పరిగణించేలా ఏపీ ప్రభుత్వంతో మాట్లాడుతానని చెప్పారన్నారు. కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో మాట్లాడి రాష్ట్రంలోనూ సైనిక్‌స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లావణ్య, కళ్యాణి, సంతోష్, మనోజ్, జాకబ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ సేవలు అభినందనీయం


ఆర్ఎస్ఐ అశోక్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఐగా బి.అశోక్‌రెడ్డి పోలీస్ శాఖకు చేసిన సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం రిటైరైన ఆర్ఎస్ఐ బి.అశోక్‌రెడ్డికి పోలీస్ కార్యాలయంలో ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్పీ అశోక్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఆయన 40ఏళ్ల 3నెలలు పోలీసుశాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలు యువ సిబ్బందికి స్ఫూర్తిదాయకమన్నారు. అశోక్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏఓ జోత్స్న, ఆర్ఐలు ఇతర పోలీస్ అధికారులు, డీపీఓ సిబ్బంది, అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి సదానందం

మోమిన్‌పేట్, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి సదానందం అన్నారు. గురువారం మోమిన్‌పేట్‌లోని పశువైద్య శాలను సందర్శించారు. మేకలు, గొర్రెలు, పశువులు, కుక్కలు ఇతర జంతువులకు వ్యాధులు సోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మోమిన్‌పేట్, మొరంగపల్లి, చీమలదరి, మేకవనంపల్లి పశువైద్య శాలల రికార్డులు తనిఖీ చేశారు. మండల పశువైద్యాధికారిణి గీత, సిబ్బంది ఉన్నారు.

మావోయిస్టు భూమిక దశదిన కర్మ


విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కేశంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు భూమిక అలియాస్ వన్నాడ విజయలక్ష్మి(38) దశదిన కర్మను మండలంలోని వేములనర్వలో గురువారం నిర్వహించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అభూజ్‌మడ్‌లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూమిక మృతిచెందారు. తండ్రి సాయిలు ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దశదినకర్మ నిర్వహించారు. నాయకులు ప్రేమ్ కుమార్‌గౌడ్, నర్సింలుగౌడ్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నది జన్మస్థలాన్ని పరిశీలించిన ఎంఆర్‌డీసీఎల్ ఎండీ



మూసీ నది జన్మస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు నర్సింహారెడ్డి, గౌతమి

వికారాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ మీదుగా ప్రవహించే మూసీ నది జన్మించిన స్థలాన్ని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.గౌతమి గురువారం సందర్శించారు. అనంతగిరి కొండల్లో అనంత పద్మనాభస్వామి ఆలయ దిగువ భాగంలో భవనాశిని పుష్కరిణి వద్ద ప్రారంభమైన మూసీ నదిని పరిశీలించారు. వారు మూసీ నది వృత్తాంతం, ప్రవహించే ప్రాంతాలపై ఆరా తీశారు. అనంతగిరి కొండల్లో నుంచి వికారాబాద్, నవాబ్‌పేట, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల మీదుగా హైదరాబాద్‌లో మూసీ నది ప్రవహిస్తున్న విషయం తెలిసిందే. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పైన ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన నేపథ్యంలో వారు మూసీ నది ఆవిర్భవించిన స్థలాన్ని సందర్శించినట్లు తెలుస్తోంది. అంతకు ముందు వారు అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు.

సజ్జన్‌పల్లిలో 'సోలార్ ఫెన్సింగ్ విత్ బ్లూ లైట్స్'


సోలార్ ఫెన్సింగ్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సజ్జన్‌పల్లిలో వన్య ప్రాణుల నుంచి పంటలను కాపాడేందుకు 'ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ సోలార్ ఫెన్సింగ్ విత్ బ్లూ లైట్స్' ప్రాజెక్టును కేజీరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సహకారంతో ప్రారంభించారు. గురువారం గ్రామంలో రైతులతో కలిసి ప్రాజెక్టును ప్రారంభించారు. కళాశాల అసోసియేట్ హెడ్ బి.లింగం మాట్లాడుతూ... పంటలను అడవి పందులు, నక్కలు, నెమళ్లు, ఇతర వన్యమృగాల నుంచి రక్షించేందుకు ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేశామన్నారు. రైతు శ్రీకాంత్ పొలంలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీసాయి సత్యనారాయణరెడ్డి, సభ్యులు రవికుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రైతులు ఉన్నారు.

హైవేపై గుంతల పూడ్చివేత

చేవెళ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం తెలిపారు. గురువారం చేవెళ్లలో కురిసిన వర్షానికి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సీఐ స్పందించి సిబ్బందితో కలిసి హైవే రోడ్డుపై పడిన గుంతలను కంకర, మట్టితో పూడ్చివేయించారు. అనంతరం మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న తరుణంలో ఎండకాలంలో వలె వాహనదారులు అతివేగంగా వెళ్లొద్దని, ఎక్కడ ఏ గుంతలుంటాయో తెలియదన్నారు. వాహనాలను జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. రోడ్డుపై గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులను స్థానికులు అభినందించారు.

టాయిలెట్లు శుభ్రం చేయించిన.. వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులతో టాయిలెట్లు శుభ్రం చేయించిన వార్డెన్లపై చర్యలు తీసుకొని వారిని విధుల నుంచి తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో విద్యార్థులతో టాయిలెట్లు, గదులను శుభ్రం చేయిస్తున్న వీడియో వైరలైందని తెలిపారు. చదువు చెప్పాల్సిన వార్డెన్లు ఇలా పిల్లలతో పనులు చేయించడం సిగ్గుచేటన్నారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రణయ్ హెచ్చరించారు.

అలుగు వర్షిణి క్షమాపణ చెప్పాలి

వికారాబాద్: ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి బాధ్యతారహిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వైగీత డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల పట్ల వివక్షపూరితంగా మాట్లాడిన ఆమెను విధుల్లోంచి తొలగించాలని అన్నారు. విద్యార్థులతో టాయిలెట్లు కడిగిస్తే తప్పేమిటని వర్షిణి అనడం సరికాదన్నారు.

ప్రగతిని ఓర్వలేకే దుష్ప్రచారం

కడ్తాల్, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా తయారయ్యాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఆనందంగా ఉండడాన్ని ఓర్వలేక ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కడ్తాల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాలనదక్షతతో రాష్ట్రం ఏడాదిన్నరలోనే అద్భుత విజయాలు సాధించిందన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ కనుమరుగేనన్నారు. ఉనికి కోసం బీజేపీ ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొడతారన్నారు. సీఎం తోడ్పాటు, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవతో నియోజకవర్గానికి మహర్దశ వచ్చిందన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు కడ్తాల్ ఎంబీఏ గార్డెన్‌లో నిర్వహిస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో నాయకులు బిచ్యానాయక్, వెంకటేశ్, జహంగిర్ అలీ, బాల్‌రాజ్, లక్పతినాయక్ పాల్గొన్నారు.


అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

సాంకేతిక కోర్సుల ద్వారా అవకాశాలు

మర్పల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కోర్సుల ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మర్పల్లిలోని ఐటీఐ కళాశాలను ఆయన సందర్శించారు. ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశానుసారం నియోజకవర్గంలో ఉన్న ఐటీఐ కాలేజీలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఎంత మంది విద్యార్థులున్నారని, ఏయే కోర్సులు చెబుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రానిక్ కోర్సులో 15మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని అధ్యాపకులు తెలిపారు. ప్రస్తుతం కళాశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం, టాటా కంపెనీ ద్వారా 50శాతం నిధులు ఇస్తోందని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు బలరాంగౌడ్, అన్నపూర్ణ, మహేశ్వరి, శ్రీమంత్‌కుమార్, మహేశ్, పరమేశ్, నాగేశ్, శేఖర్, శ్రీధర్, జైపాల్, తుల్జన్న, లక్ష్మణ్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

బస్సులో సీట్ల కోసం కొట్లాట!



పరిగి, మే 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సీట్ల కోసం కొట్టుకున్నారు. గురువారం పరిగి నుంచి వికారాబాద్ వెళ్తున్న బస్సులో ఈ ఘటన జరిగింది. పరిగి బస్‌స్టేషన్‌లో వికారాబాద్ బస్సులో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఎక్కారు. పరిగి నుంచి బస్సు బయలుదేరింది. సీట్ల కోసం కొట్లాట మొదలైంది. డ్రైవర్ బస్సును నస్కల్ వద్ద నిలిపారు. సీట్ల కోసం మహిళలు, పురుషులు తోసుకున్నారు. ఆడ, మగ తేడాలేకుండా కొట్టుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వచ్చిన తర్వాత ఆడవారే బస్సులన్నీ నిండుతున్నారని పురుషులు రుసరుసలాడారు. కాగా ఈ బస్సులో సీట్ల కోసం కొట్లాటను ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు.

కొన్న వడ్లను వెంటనే తరలించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున కొన్నవెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్, అంకుశాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తరలించేందుకు లారీలను అందు బాటులో ఉంచాలన్నారు. రెండు రోజుల్లో ధాన్యాన్ని పూర్తిగా తరలించాలన్నారు. ధాన్యంలో తాలు, దుమ్ము లేకుండా తీసుకురావాలని రైతులకు సూచించారు. ధాన్యం తరలించేందుకు అదనపు లారీలను సమకూర్చాలన్నారు. ధాన్యం విక్రయించిన తరువాత 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమా అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ సుగుణబాయి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఆర్‌ఐ కావ్యారెడ్డి, ఎఈవో జగదీశ్, సెంటర్ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి, మాదజీ ఉపసర్పంచ్ ఉప్పు లింగేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

'బోగస్'పై ఫోకస్!

(ఐదో పేజీ తరువాయి)

కంటే అధికంగా ఖర్చుపెడుతోంది. ఇదిలా ఉంటే వర్షాకాలంలో రవాణా సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున పేదలకు పంపిణీ చేసే సబ్సిడీ బియ్యం మూడునెలల కోటాను ఒకే సారి ఇవ్వాలని ఇటీవల కేంద్రం ఆదేశించింది. దీంతో జూన్‌నెలలో ఒకే సారి మూడు నెలల కోటా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఇదే సమయంలో బోగస్ కార్డుల ఏరివేతపై కూడా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డుదారుల జాబితాను క్షుణంగా తనిఖీ చేయాలని ఆదేశించింది. ఆరు నెలలకు పైగా రేషన్ బియ్యం తీసుకోని కార్డుదారులను తీసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే వందేళ్లకు పైబడిన వారి పేరు మీద కూడా చాలా కార్డులు ఉన్నాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించింది. స్థానికంగా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించి అనర్హులను ఏరివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కొన్ని రోజులుగా బోగస్ కార్డుల ఏరివేతపై దృష్టిసారించారు.

ఉమ్మడి జిల్లాలో కార్డుల వివరాలిలా..



ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత కార్డులు ఉన్న వారు దాదాపు 13.75 లక్షల మంది ఉన్నారు. ఇందులో రంగారెడ్డిజిల్లాలో అత్యధికంగా 5,78,500 కార్డులు, మేడ్చల్ జిల్లాలో 5,36,755 కార్డులు, వికారాబాద్ జిల్లాలో 2,50,563 కార్డులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో కార్డుదారులకు ప్రతి నెలా దాదాపు 30వేల టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉంటే పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన డేటా ఆధారంగా మేడ్చల్ జిల్లాలో 8,300 రేషన్‌కార్డులు, రంగారెడ్డిజిల్లాలో 6711, వికారాబాద్ జిల్లాలో 2290 బోగస్ రేషన్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. వీటన్నింటిపై విచారణ జరిపి తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే రేషన్‌కార్డుల తనిఖీ దాదాపు పూర్తయింది. వీటితో పాటు మరి కొన్ని బోగస్ కార్డులను కూడా విచారణ సిబ్బంది గుర్తించారు. క్షేత్ర స్థాయిలో వీటిపై కూడా విచారణ కొనసాగుతోంది. కార్డులపై నిర్వహిస్తున్న విచారణ రంగారెడ్డిజిల్లాలో 87శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 17,301 బోగస్‌కార్డులు ఉన్నట్లు గుర్తించగా ఇవికాక మరో 10వేల వరకు బోగస్ కార్డులు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. కొద్ది రోజుల్లో వీటిపై స్పష్టత వస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

స్వచ్ఛందంగా ...

గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బోగస్ కార్డులను ఏరివేతకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెళ్లైన తరువాత వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు తమ పేర్లను తొలగించాలని స్వయంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇటీవల కొత్తకార్డుల కోసం పెళ్లైన జంటలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా కొత్తకార్డులు తీసుకునేందుకు ఇలా తల్లిదండ్రుల కార్డుల నుంచి తమ పేర్లు తొలగించుకుంటున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగమొచ్చేలా చూస్తా

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

» మెగా జాబ్ మేళాలో 1,464 మంది ఎంపిక

తాండూరు, మే 29(ఆంధ్రజ్యోతి): చదువుకున్న ప్రతీ యువతీ యువకుడికి ఉద్యోగావకాశం కల్పించేలా కృషిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జాబ్ మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. తాండూరు కందిపంటకు ప్రసిద్ధి అన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించే దిశగా ప్రణాళికను తయారు చేశామని చెప్పారు. 63 కంపెనీల్లో 11వేల ఉద్యోగాలకు 4వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారని తెలిపారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన నాయకులకు, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్, మెడికల్ శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పది కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఈజీఎంఎం సహకారంతో ఈ మేళాను నిర్వహించారు. తాండూరు చరిత్రలో ఇంతపెద్ద జాబ్‌మేళాను నిర్వహించలేదు. మేళాకు తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలు, మహబూబ్‌నగర్, సంగారెడ్డి ప్రాంతాల యువతీయువకులు తరలివచ్చారు. 2,764 మంది దరఖాస్తులు సమర్పించగా 1,464 మందిని వివిధ కంపెనీలు ఎంపికచేసుకున్నాయి. వారికి కంపెనీలు అక్కడికక్కడే ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ ఎం.రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ స్వప్న, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోట్‌పల్లి, బషీరాబాద్, మార్కెట్ కమిటీల చైర్మన్లు అంజయ్య, మాధవరెడ్డి, నాయకులు మురళీకృష్ణగౌడ్, నర్సిములు, విఠల్‌నాయక్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి, హబీబ్ లాల, లొంక నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



ఆమనగల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): పేదలు ఆర్థికంగా బలపడి కష్టాల బారి నుంచి బయటపడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు బాగుపడడాన్ని ఓర్వలేకనే విపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమనగల్లు 14వ వార్డు అంబేడ్కర్ కాలనీలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, నిబంధన లోబడి నిర్మాణం పూర్తిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆమనగల్లులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జగన్, బిచ్యా, వస్పుల మానయ్య, మల్లయ్య, విజయ్‌నాయక్, ఫరీద్, అప్పం శ్రీను, వెంకటేశ్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 300 ట్రాన్స్‌ఫార్మర్లు : ఎమ్మెల్యే

కల్వకుర్తి నియోజకవర్గానికి 300 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. లో-వోల్టేజీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ చేపట్టారు. నాయకులు బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, అనిల్, విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి, డేవిడ్, శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై మరో అధికారిపై వేటు!

» తప్పించేందుకు కాంగ్రెస్ నేత యత్నాలు

» సీనియర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించే అవకాశం

తాండూరు, మే 29(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో మరో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు పడే అవకాశం ఉంది. సస్పెండ్‌కు గురైన ఫసియొద్దీన్ కంటే ముందు పనిచేసిన మరో ఇద్దరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లతో ఒకరు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన జూనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధమైంది. అయితే సంబంధిత అధికారిపై వేటు పడకుండా అధికార పార్టీకి చెందిన ఒక నేత తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ నేత ఒత్తిడితోనే అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. అక్రమ రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వానికి భారీ మొత్తంలో నష్టం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం విధితమే. నిజానిజాలు తేలిన తర్వాత భారీ జరిమానాలు విధిస్తారా! రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తారా! అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన ఆడిట్ డీఆర్ఎం నివేదికను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. జనవరి నుంచి మే మొదటి వారం వరకు జరిగిన కచ్చ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లపై సమగ్ర విచారణ జరిగితే పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఒకరిపైనే వేటు వేసి మరో అధికారిని తప్పిస్తే అసలు విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉండదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తాండూరుకు పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్‌ను నియమించనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలి

(ఐదో పేజీ తరువాయి)

కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు, అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు అందజేయాలని అధికారులకు సూచించారు. రాజీవ్ యువ వికాసంలో ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యత ఉన్న యూనిట్లను ఎంపిక చేసి వారికి సరైన అవకాశం కల్పించాలని కలెక్టర్లకు సూచించారు ప్రభుత్వ భూములు ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే అటు విలువైన భూములను కాపాడాలన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లపై మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 17,440 ఇళ్లను కేటాయించగా.. అందులో 16,617 ఇళ్లు మంజూరివ్వడం జరిగిందన్నారు. 4,084 ఇళ్లు ఇప్పటికే పూర్తయినట్లు చెప్పారు. వచ్చే వారంలో పదివేల ఇండ్లు ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాంక్రాంతమవుతున్నాయని తన దృష్టికి వచ్చిందని, వాటిని పరిరక్షించేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అధికారులు చొరవచూపాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కాల యాదయ్య అరెకపూడి గాంధీ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వీర్లపల్లి శంకర్, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ నూతన కమిటీలో చల్లా, మల్లు


డాక్టర్ మల్లు రవి


చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతన కమిటీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి చోటు లభించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ కాంగ్రెస్ డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా చల్లా వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ మల్లు రవి నియమితులయ్యారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెంది వంశీచంద్‌రెడ్డి ఇప్పటికే ఏఐసీసీలో కీలక పదవిలో ఉన్నారు. మరోసారి ఆయన సేవలను గుర్తించి డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడిగా వంశీచంద్‌రెడ్డికి పేరుంది. ఆయన నియామకం పట్ల కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా అందరూ ఊహించనట్లుగానే మల్లు రవికి అవకాశం దక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. తెలంగాణ ఎంపీల ఫోరం చైర్మన్‌గా మల్లు కొనసాగుతున్నారు. అందరినీ కలుపుకుపోయే తత్వం కలిగిన రవికి చైర్మన్‌గా అవకాశం లభించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

» డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరవణ అన్నారు. గురువారం రామయ్యగూడ అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్, ఫార్మసీ, ల్యాబ్, ఔట్ పేషెంట్ విభాగాలను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. అనంతరం అన్ని ఆస్పత్రులు, పీహెచ్‌సీల వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆమ్డాపూర్‌లో ఇళ్ల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు

మొయినాబాద్ రూరల్/శంకర్‌పల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, పేదల ఇంటికలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం పెద్దమంగళారం, ఆమ్డాపూర్ గ్రామాల్లో ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల కోసం కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి గూడు లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్, ప్యాక్స్ చైర్మన్ చంద్రారెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, రాజు పాల్గొన్నారు. శంకర్‌పల్లి పట్టణ పరిధి సాయికాలనీ, రుత్విక్ వెంచర్, సింగాపూర్‌లలో రూ.1.87కోట్లతో వేసే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే, కమిషనర్ యోగేష్‌లు ప్రారంభించారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తానన్నారు. కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం అన్నారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలిన సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, నాయకులు సాత ప్రవీన్‌కుమార్, వెంకట్‌రాంరెడ్డి, ప్రకాశ్, చంద్రమౌళి, పాండురంగారెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విఠలయ్య, మహేందర్‌రెడ్డి, లచ్చయ్య, రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జలవిహార్‌లో టీజేఎఫ్ రజతోత్సవాలు

శంషాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25 వసంతాల సంబురం నిర్వహిస్తున్నట్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌సాగర్ తెలిపారు. గురువారం శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 31న నిర్వహించే రజతోత్సవాలకు జిల్లాలోని జర్నలిస్టులందరూ తరలొచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు దూడల కృష్ణాగౌడ్, మసూద్ అలీఖాన్, వెంకటయ్య, అంజిలప్ప, ప్రశాంత్, గణేశ్, నాగేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మిత్రులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్ఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో 2005-06 టెన్త్ బ్యాచ్‌కు చెందిన నారోజు బాల కృష్ణచారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబానికి ఆర్థిక భారం తీర్చేలా బాలకృష్ణచారితో కలిసి చదువుకున్న స్నేహితులు గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తలా కొంత పోగు చేసిన రూ.50వేల నగదును అందజేశారు. రాఘవేందర్, మహేందర్, జంగయ్య, మల్లేశ్, ఆంజనేయులు, నరేష్, విజయ్‌కుమార్, నర్సింహ, హరికృష్ణ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కేశంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామానికి చెందిన పంచాయతీ వాటర్‌మ్యాన్ కృసరం పాండు యాదవ్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ సర్పంచ్ జగన్‌నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జర్పుల రాజునాయక్‌లు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 9 వేలు అందించారు. శ్రీనునాయక్, శ్రీశైలం, నారాయణ, రాజు, భాస్కర్, రెడ్యానాయక్, రామచంద్రయ్య, పెంటయ్య తదితరులున్నారు.

మోస్తరు నుంచి భారీ వర్షం

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలో గురువారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దాంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముందస్తు రుతుపవనాల మూలంగా వాతావరణం కొంతమేర చల్లబడగా ఈ వర్షంతో మరింత మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే మెట్టలో విత్తనాలు వేస్తున్న రైతులు సాగును ముమ్మరం చేయనున్నారు. కాగా, ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది. కొన్నిచోట్ల వర్షానికి ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు.

అను'మతిలేని' వైద్యం!

(ఐదో పేజీ తరువాయి)

జరిగినప్పుడు మాత్రమే జిల్లా వైద్యాధికారులు స్పందిస్తున్నారు. హడావిడిగా క్లినిక్‌లను సీజ్ చేసి వెళ్లిపోతున్నారు. సీజ్ అయిన 24 గంటల్లోనే తిరిగి ఓపెన్ చేయడం పరిపాటిగా మారింది.

వైద్యో నారాయణో హరి అంటారు.. వైద్యుడిని దేవునితో పోల్చుతారు. అలాటి వైద్య వృత్తికి కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు మచ్చ తెస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన వారు డాక్టర్ల అవతారమెత్తి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. పరిధిని మించి వైద్యం చేస్తున్న కొందరి వల్ల నీతి నిజాయితీతో ప్రాథమిక వైద్యం చేసే వాళ్లకూ ఇబ్బంది వస్తోంది. జిల్లాలో 344 ప్రభుత్వ ఆసుపత్రులు ఉండగా.. 3,260 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో చిన్నాచితక 745 క్లినిక్‌లు ఉండగా డయాగ్నొస్టిక్ సెంటర్లు 569, అల్లోపతి 1,453, డెంటల్ 394, ఆయుర్వేద 42, హోమియోపతి 8, ఫిజియోథెరపి 49 ఆసుపత్రులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం కొనసాగుతున్నాయి. లెక్కకు రానివి ఇంకా చాలానే ఉన్నాయి. మెజారిటీ క్లినిక్స్ వనస్థలిపురం, హస్తినాపురం, సరూర్‌నగర్, బాలానగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఓ వైపు ఎస్‌వోటీ పోలీసులు, మరో వైపు తెలంగాణ వైద్య మండలి సభ్యులు వరుస తనిఖీలు చేస్తున్నా నకిలీ వైద్యులు ఏమాత్రం వెరవడం లేదు. యథేచ్ఛగా ఎంబీబీఎస్ వైద్యులుగా చెలామణి అవుతూ గుట్టుగా ఆపరేషన్లు, అబార్షన్లు చేసేస్తున్నారు. ఎప్పటికప్పుడు క్లినిక్‌లు, ఫార్మాసీల్లో తనిఖీలు నిర్వహించాల్సిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా



నర్సింహులు ఆపరేషన్ చేయించుకున్న చేవెళ్లలోని ప్రజా వైద్యశాల

డ్రగ్ కంట్రోల్ అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ఎవరికైనా ఫిర్యాదు చేస్తేనే కానీ తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

చంపేస్తున్నారు..!

వచ్చీరాని వైద్యంతో రోగులను చంపేస్తున్నారు. టెన్త్, ఇంటర్ పూర్తి చేయని వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వార్డు బాయ్‌గా చేరి.. ఆ తర్వాత ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులుగా అవతరమెత్తుతున్నారు. మరికొంత మంది ఏకంగా ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి అవుతున్నారు. ప్రాథమిక చికిత్సలకే పరిమితం కావాల్సిన వారు ఏకంగా అబార్షన్లు, కన్నీలు, సున్తీలు చేస్తున్నారు. పేదలు, నిరక్షరాస్యులు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలు, బస్తీవాసులు నివాసం ఉండే ప్రాంతాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్, నందనవనం, బీఎన్‌రెడ్డి, నందనవనం, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, మీర్‌పేట్, నాదర్‌గుల్, శంషాబాద్, జల్‌పల్లి, బాలాపూర్, షాద్‌నగర్, కొందుర్గు, ఆమనగల్లు, మాడ్గుల, మంచాల, యాచారం, తాలకొండపల్లి, కేశంపేట్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో నకిలీల బెడద ఎక్కువైంది. డయాగ్నొస్టిక్, మెడికల్‌షాపుల మాటున యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. సాధారణ జ్వరం, నొప్పులతో బాధపడుతున్న వారికి హైడోస్ యాంటీబయోటిక్, పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లు ఇస్తూ హస్తవాసి ఉన్న వైద్యులుగా చెలామణి అవుతున్నారు. వీరిచ్చే హైడోస్ మందులతో తాత్కాలికంగా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తున్నప్పటికీ భవిష్యత్‌లో కిడ్నీల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఇలా సీజ్.. అలా ఓపెన్..

ప్రైవేట్ క్లినిక్‌లో వచ్చీరాని వైద్యంతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. సంఘటన జరిగిన రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వచ్చి ప్రైవేట్ క్లినిక్‌లు సీజ్ చేస్తున్నారు. 24 గంటలు దాటక ముందే తిరిగి ఓపెన్ అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్ట చెప్పడంతో యథావిధిగా క్లినిక్‌లు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే షాద్‌నగర్‌లో సిద్ధాపూర్ దవాఖాన, ప్రజావైద్యశాల, రాజమెడికల్ అండ్ జనరల్ అండ్ స్టోర్స్‌ను సీజ్ చేశారు. మరుసటి రోజే ఇవన్నీ ఓపెన్ కావడంతో షాద్‌నగర్ ప్రాంత ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. అలాగే చేవెళ్ల మండల కేంద్రంలలో రెండు క్లినిక్‌లు సీజ్ చేసిన వారం రోజులకే తిరిగి తెరుచున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా అధికారులు సీజ్ చేయడం.. రెండు రోజులకే యథేచ్ఛగా తెరుచుకోవడం షరామామూలుగా మారిందంటున్నారు.

క్రైం కార్నర్

పెళ్లైన వారానికే ఆ ఇంట్లో విషాదం

- దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- తండ్రి మృతి, భార్య, కుమారుడు, కోడలికి తీవ్ర గాయాలు
- మృతుడు షాద్‌నగర్‌వాసి.. తిరుపతి వెళ్లొస్తుండగా ఘటన



పవన్ కుమార్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి వారం రోజులు గడవక ముందే పెళ్లివారింట్లో విషాదం అలుముకుంది. పెళ్లి తంతు ముగిసిన తర్వాత తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కడప జిల్లా ఓర్వకల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, ఆయన భార్య, కుమారుడు, కోడలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే విల్లాస్‌లో నివాసముండే పవన్ కుమార్(55) మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు వికాస్(28) వివాహం ఈనెల 21న జరిపించారు. పెళ్లి కార్యక్రమాలు ముగియడంతో మంగళవారం పవన్ కుమార్‌తో పాటు ఆయన భార్య ప్రసన్న(50), కుమారుడు వికాస్, కోడలు మాధురి ఇతర బంధువుల తో కలిసి తిరుపతి వెళ్లారు. బంధువులకు దర్శనం ముందుగా కావడంతో అందరూ తిరుగు ప్రయాణమయ్యారు. పవన్ కుమార్ కు టుంబానికి దర్శనం ఆలస్యం కావడంతో బుధవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో కడప జిల్లా ఓర్వకల్లు సమీపంలోకి రాగానే గురువారం తెల్లవారు జామున సుమారు 5.30 గంటలకు కారు డివైడర్‌ను ఢీకొంది. దాంతో కారు మూడు పల్టీలు కొట్టినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే పవన్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, వికాస్ కాలు, ప్రసన్న చేయి విరిగింది. మాధురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కాగా, ప్రమాద సమయంలో కారు వికాస్ నడుపుతున్నట్లు సమాచారం. పవన్ కుమార్ మృతదేహాన్ని, క్షత గాత్రులను బంధువులు గురువారం సాయంత్రం షాద్‌నగర్ తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే సీఎస్కే విల్లాస్‌లో విషాదం అలముకుంది.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

షాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మీరాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. చర్లగూడ గ్రామానికి చెందిన నక్కల కిష్టయ్య మీరాపూర్ గ్రామం వద్ద తన పాడి ఆవుకు మేత మేపుతున్నాడు. ఈ క్రమంలో ఆవు విద్యుత్ స్తంభం స్టేవైర్ వద్దకు వెళ్లింది. విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కోరాడు.



చిన్న చిల్కమర్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- బడిబాట కార్యక్రమంలో ఎంఈవో మనోహర్

షాద్‌నగర్ అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఫరూఖ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని జీడివడకతండా, శేరిగూడెం, నేరెళ్ళచెరువు, నేరుళ్ళ చెరువుతండా, తిమ్మాజీపల్లి తండా, చిన్న చిల్కమర్రి ప్రాథమిక పాఠశాలల్లో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలలో పాల్గొన్న ఎంఈవో మనోహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలంతో పాటు అర్హత, అనుభవం కల్గిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదువు చెబుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జేసీ వెంకటయ్య, బి.కృష్ణయ్య, ఎన్.నర్సింహులు, ఎం. చంద్రశేఖర్, జనార్ధన్‌రెడ్డి, కృష్ణ, సత్యం, సరేష్‌గౌడ్, మేఘాబాయి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

కడ్తాల్, మే 29 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, నేర పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి బొప్పిడి గోపాల్ అన్నారు. రావిచెడ్ శ్రీ వేంకటేశ్వరాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బొప్పిడి గోపాల్ రూ.10వేలు సమకూర్చారు. కొనుగోలు చేసిన సీసీ కెమెరాలను గురువారం సీసీ కెమెరాల ఇన్‌చార్జి కానిస్టేబుల్ మహేశ్‌కు అందించారు. గోపాల్‌ను సీఐ గంగాధర్ అభినందించారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి

- పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆకులమైలారం, రాచులూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన అనంతరం భూమిపూజ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. కాగా, కొత్తగూడలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శి ఉమాదేవి మంజూరు పత్రాలందజేశారు. అగర్‌మియాగూడలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇ.శ్రీకాంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు ఇ.దిలీప్‌రెడ్డితో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. నాయకులు అందుగుల సత్యనారాయణ,జి. రాజు, సరికొండ జగన్, అండేకార్ సురేందర్, డి.నర్సింహ్మాచారి, జి.బాబు, ఆర్ సురేష్, అశోక్, రాంరెడ్డి, ఆర్.జంగయ్య, సొడపు శేఖర్‌గౌడ్, ఎండి ఖదీర్, కుమ్మరి కృష్ణయ్య, బొక్క దేవేందర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేస్తుందని పోలెపల్లి మాజీ సర్పంచ్ బాల్‌రామ్, మాజీ ఉప సర్పంచ్ అంజన్ రెడ్డిలు అన్నారు. గ్రామంలో లబ్ధిదారులకు



కందుకూరు : ఆకులమైలారంలో ప్రొసీడింగ్ అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు కృష్ణారెడ్డి, భగవాన్‌రెడ్డి, జంగయ్య, శేఖర్, రామస్వామి, దేవేందర్, తతదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : దేవుని పడకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు స్థానిక మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యదర్శి ఆశిష్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రామస్వామి, శ్రీను, కృష్ణయ్య, వెంకటేశ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా 85ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. యాచారం, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, కుర్మిద్ద, తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు లబ్ధిదారులు పనులు ప్రారంభించారు. కార్యదర్శుల పర్యవేక్షణలో నిర్మాణాలు చేపడుతున్నామని ఎంపీడీవో శైలజ, ఎంపీవో శ్రీలత చెప్పారు.

కేశంపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి ప్రొసీడింగ్స్ అందించారు. కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌రెడ్డి, కొట్టం ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రయ్యగౌడ్, ప్రకాష్ చారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే పాపిరెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందించారు. అబ్బి సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, దేవేందర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి, కృష్ణారెడ్డి, ప్రభాకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : పాపిరెడ్డిగూడలో ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసిన కాంగ్రెస్ నాయకులు

రూ.5 లక్షలతో ఇల్లు నిర్మించాలి

కేశంపేట : ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని, ఆ దిశగా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కేశంపేట తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లపై కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కూలి, ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలలో తేడాలు లేకుండా చూడాలని తెలిపారు. గ్రామ సమీపంలో వాగులు ఉంటే అక్కడి నుంచి ఇసుక తీసుకునే విధంగా లబ్ధిదారులకు సూచన చేయాలని వారు సూచించారు.



తలకొండపల్లి : పడకల్‌లో మంజూరు పత్రాలను అందజేస్తున్న మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఉద్యమకారులను గుర్తించండి

షాద్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ తాలూకా డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. సంఘం చైర్మన్ పి.వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను అన్ని రకాలుగా ఆదుకుంటామంటూ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారులకు ఇంటిస్థలంతో పాటు, అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం, ఉద్యమకారుల కోసం రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు, ఉద్యమకారులకు వేతనం కల్పించాలని ఎమ్మెల్యేకు వివరించామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, ఇంటి స్థలాలు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సమ్మతించారని తెలిపారు. ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, బాలునాయక్, రవి, రవికుమార్, జాంగారి నర్సింహులు, రాజు, మేకల వెంకటేష్ తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి

ఆమనగల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమనగల్లు జేఏసీ నాయకులు అవ్వారి శివలింగం, అప్పం శ్రీను, కాలె మల్లయ్య, పూసల పరమేశ్‌లు కోరారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులను విస్మరించి నిర్లక్ష్యానికి గురిచేసిందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం విలేఖరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చినహామీలకనుగుణంగా ఉద్యమకారులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవుల్లో, ప్రభుత్వ పథకాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. జూన్ 2న ఉద్యమకారులకు 250చదరపు గజాల స్థలాన్ని కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

డిపోలో ప్రశాంతతను దెబ్బతీస్తే సహించం

- 'పట్నం' ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప

ఇబ్రహీంపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న సిబ్బందిలో పలువురు తమ స్వార్థంకోసం జేఏసీగా ఏర్పడి డిపో ప్రశాంతతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని, ఇది ఎంతమాత్రం తగదని డిపో మేనేజర్ బి.వెంకటనర్సప్ప తెలిపారు. బుధవారం డిపో ఎదుట కొందరు డీఎం వైఖరిని నిరసిస్తూ చేపట్టిన ఆందోళనపై గురువారం ఆయన పత్రికా ప్రకటన ద్వారా ఆయన వివరణ ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సిబ్బంది సహకారంతో సాఫీగా బస్సులు నడుపుతున్నామన్నారు. కాగా, కొందరు సూపర్‌వైజర్ సిబ్బందిని స్థానచలనం చేయడంతో వారే మరి కొందరితో కలిసి ఈ నిరసన చేపట్టారని తెలిపారు. ఏదైనా క్రమశిక్షణా చర్యలు తీసుకున్నా.. అది సంస్థ నియమావళి ప్రకారం చేసిందేనని ఆయన పేర్కొన్నారు. డిపో సిబ్బంది, సూపర్‌వైజర్లతో కలిసి సమష్టిగా ముందుకు పోతున్నామని, కొందరు లేనిపోని సమస్యలు సృష్టిస్తే తగిన చర్యలు తప్పవంటూ ఆయన హెచ్చరించారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

తలకొండపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, షీల్డ్‌లను బహూకరించారు. నాయకులు జిల్లెల్ల శ్రీశైలం యాదవ్, శానమోని పాండు, పద్మ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



షీల్డ్‌ను బహూకరిస్తున్న కాసు శ్రీనివాస్‌రెడ్డి

నేల స్వభావాన్ని బట్టే పంటల సాగు



మాడ్గుల : అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మురళి పాల్గొన్న రైతులు

ఆమనగల్లు/మాడ్గుల, మే 29(ఆంధ్రజ్యోతి): నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేసి పెట్టుబడులను తగ్గించుకొని దిగుబడి పెంచుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.మాధవీలత, డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ ప్రశాంతిలు అన్నారు. సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకొని సేంద్రియ ఎరువులను వినియోగించాలని వారు సూచించారు. ఆమనగల్లు మండలం రాంనుంతల రైతు వేదికలో గురువారం రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ఏవో శ్రీనివాస్ అధ్యక్షతన రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని వారు సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కావ్య, రైతు నాయకులు పంతూనాయక్, యాదయ్య, సత్తయ్య , శ్రీనివాస్, సరిత, దోలి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేసుకుంటూ అంతర్గత పంటలు వేసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ మురళి సూచించారు. మాడ్గుల మండలం సుద్దపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏవో అరుణ కుమారి, విస్తరణాధికారులు జోత్స్న, రాజేష్ నాయక్, గురుప్రసాద్, ఎంపీటీసీ వెంకటయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలి



డీలర్లతో మాట్లాడుతున్న ఏవో అనురాధ

మొయినాబాద్ రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): డీలర్లు ప్రభుత్వ నిబంధనలను ఎప్పటికప్పుడూ పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. గురువారం ఆమె కార్యాలయంలో మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పరిధిని దాటి వాణిజ్యం చేయడం అనైతికమని, చట్ట విరుద్ధమని చెప్పారు. డీలర్ల షాపులను త్వరలో తనిఖీ చేయడం జరుగుతుందని... రికార్డులను పరిశీలించడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మకం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కిషన్‌సింగ్ హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల టెక్నికల్ వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' పనులు ప్రారంభం

షాద్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్కే విల్లాస్‌లో మిషన్ భగీరథ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం సీఎస్కే గ్రీన్ విల్లాస్ అధ్యక్షుడు అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి ఫలితంగానే విల్లాస్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేత జమృత్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ శ్రావణి, విల్లాస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలి

(ఐదో పేజీ తరువాయి)

విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రైతుల సమస్యలు పరిష్కరించండి : సబితారెడ్డి

కందుకూరు : ఫార్మాసిటీ రైతుల సమస్యలు పరిష్కరించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరారు. ఫార్మాసిటీ రైతులతో కలిసి గురువారం కలెక్టర్ సి. నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కందుకూరు రెవెన్యూలోని 107 సర్వే నెంబర్‌లో 330మంది లబ్ధిదారులు, కొత్తగూడ గ్రామ పంచాయతీలో ఉన్న 788 సర్వే నెంబర్‌లో 183మంది నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు త్వరగా పొజిషన్ చూపాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండా టీజీఐఐసీ పేరిట ఆన్‌లైన్‌లో నమోదైన భూమిని వెంటనే తిరిగి రైతుల పేరిట మార్చి, రైతు భరోసా తదితర పథకాలు వర్తింపజేయాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, పాశ్చ భాష, రామిడి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రభాకర్, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, రాజునాయక్, గోవర్ధన్ నాయక్, శేఖర్ గుప్తా, గుర్రం సాయికిరణ్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కడ్తాల మండల పరిధిలో భూ సమస్యలు పరిష్కరించి రైతుల ఇబ్బందులు తీర్చాలని కలెక్టర్ నారాయణ రెడ్డిని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. భూ భారతి ద్వారా దరఖాస్తు చేసుకున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

మొయినాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 75 మంది దాతలు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 250 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేసినట్లు చెప్పారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మంద కృష్ణ పోరాట ఫలితమే 'ఎస్సీ వర్గీకరణ'

ఆమనగల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధన అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ అన్నారు. ఐక్య పోరాటం ద్వారానే వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు కావలి శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కిరణ్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పద్మశ్రీ అవార్డు అందుకొని ఈనెల 31న వరంగల్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు స్వాగతం పలుకడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. విజయ్‌కుమార్, తదితరులున్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మెడికల్ కిట్లను సమకూర్చారు. స్థానిక నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వాటిని పంపిణీ చేశారు. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారని వారు తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.